క్లుప్తంగా

ముగిసిన హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు



రామునాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చిన్నశ్రీను

పద్మనాభం: రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన చింతలవలస ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ కోరాడ రామునాయుడు అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. స్వగ్రామమైన కోరాడలో అభిమానులు, బంధువులు, బెటాలియన్ సిబ్బంది అశ్రు నయనాల మధ్య, వేలాది మందితో అంతిమ యాత్ర సాగింది. గ్రామ శివారులోని శ్మశాన వాటికలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. బెటాలియన్ పోలీసులు కవాతు నిర్వహించి, గాలిలో కాల్పులు జరిపారు. అంతకు ముందు రామునాయుడు భౌతికదేహాన్ని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స లక్ష్మణరావు, బెటాలియన్ అదనపు కమాండెంట్ రాజారెడ్డి సందర్శించి, నివాళులర్పించారు.

కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

పద్మనాభం: కృష్ణాపురంలోని కసూర్బా విద్యాలయాన్ని భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించిన ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? రుచి ఎలా ఉంటోందని విద్యార్థినులను ఆరా తీశారు. అనంతరం కొత్త కొవ్వాడ గ్రామంలో పర్యటించారు. ఈ గ్రామానికి చెందిన పొన్నకాయల రాములమ్మ తనకు రైతు భరోసా అందలేదని సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేయడంతో, దీనిపై ఆర్డీవో విచారణ చేపట్టారు. తదుపరి బాందేవుపురం గ్రామంలో పర్యటించి జిరాయితీ భూమికి సంబంధించి విశాఖపట్నం సీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కె.ఆనంద రావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశాలకు ఆహ్వానం

బీచ్‌రోడ్డు: త్వరలో జరగనున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశాలకు హాజరు కావాలని పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావును ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు ఆహ్వానించారు. మంగళవారం ఆయనను ఆనందపురంలో కలిసి, ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, పూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

తగరపువలస: ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీ తంగుడుబిల్లిలో హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడి లబ్ధిదారులకు ప్రతిపాదించిన 16,996 ఇళ్ల పరిస్థితి గురించి అధికారులతో మాట్లాడి, అనంతరం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడిన అనంతరం అక్కడి నుంచి కలెక్టర్, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కాలనీకి వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఈ ఈ సూరిబాబు, తహసీల్దార్ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

తగరపువలస: కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్‌కు భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు మంగళవారం నివాళులు అర్పించారు. చిట్టివలస సిటు కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆరేళ్లపాటు ముఖ్యమంత్రిగా, మూడుసార్లు ప్రతిపక్షనేతగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా కార్మికులు, రైతుల శ్రేయస్సుకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. కేరళలో ప్రజాకర్షణ గల నేతగా నిలిచారన్నారు. ఆయనకు నివాళులు అర్పించిన వారిలో ఎస్.అప్పలనాయుడు, పల్లా పెంటరాజు, పల్లా రమణ, ఎల్లాజీ, జోగ వెంకటరావు, నమ్మి నాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

జలమే.. గరళమై..

జలమే గరళంగా మారితే.. పేదల ఆరోగ్యానికి భద్రత ఎక్కడ ఉంటుంది? ఇందుకు గాయత్రీ నగర్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ప్రబలిన డయేరియానే నిదర్శనం. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాల్సిన పాలకులు.. అధికారుల వైఫల్యం కారణంగా పదుల సంఖ్యలో పేదలు డయేరియా బారిన పడ్డారు. పన్నుల రూపంలో ప్రజల ముక్కుపిండి మరీ వేలకు వేలు వసూలు చేస్తున్న కార్పొరేషన్ మౌలిక వసతుల కల్పన, నిర్వహణలో శ్రద్ధ చూపకపోవడంతో బాధితులు పేదలే అవుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా హడావిడిగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి, ప్రస్తుతానికి డయేరియాను అదుపులోకి తీసుకువచ్చినా.. ఇప్పటికీ కాలనీవాసులకు అందని సురక్షిత తాగునీరు ఏ క్షణమైనా ప్రమాదాన్ని స్వాగతించవచ్చు. తాత్కాలిక చర్యలతో మమ అనిపించకుండా శాశ్వత చర్యల దిశగా అడుగులు వేస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ.





గాయత్రినగర్‌లో మూలకు చేరిన బోరు బావుల్లో ఒకటి

ఆరుబయటే సూయజ్ ట్యాంక్ వ్యర్థాలు



గాయత్రినగర్‌లో సంప్ శుభ్రం చేస్తున్న క్రమంలో బయటకు వస్తున్న నాచు పట్టిన నీరు

- పేదల కాలనీలో ప్రబలిన డయేరియా
- అందుబాటులో లేని కుళాయిలు
- పని చేయని బోర్లు
- సింటెక్స్‌ల ద్వారానే నీటి సరఫరా
- అపరిశుభ్రంగా నీటి సంప్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పరిధి పీఎం పాలెం గాయత్రి నగర్ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నీటి కాలుష్యం కారణంగా 23మందికి డయేరియా సోకింది. కొందరికి ప్రాణాలు మీదకి కూడా వచ్చింది. కొందరు ఆస్పత్రిలో చేరగా, మరి కొందరికి ఇక్కడే వైద్య శిబిరాల ద్వారా చికిత్స అందించారు. వారం రోజుల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చినట్టు కన్పిస్తోంది. ఇప్పటికీ ఒక మహిళ నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరొకరు సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల క్రితం వరకు కేసులు నమోదు అవుతూనే వచ్చాయి. కలుషిత నీటి వల్లనే డయేరియా సోకిందని వైద్యులు చెబుతున్నారు.

గరళ జలాన్ని సరఫరా చేసింది సంపే

ఈ కాలనీలో ప్రజలకు వ్యక్తిగత కుళాయిలు లేవు. ఉన్న బోర్లు పనిచేయడం లేదు. కాలనీలో ఉన్న 150కేఎల్ సంప్‌ల ద్వారా బ్లాకుల మీద సింటెక్స్ ట్యాంక్‌లకు నీరు ఎక్కించి, వాటి నుంచి బ్లాకుల కింద ఉన్న కుళాయి ద్వారా నీరు సరఫరా అవుతుంది. కాలనీకి నీటిని సరఫరా చేసే సంప్ నెలల తరబడి శుభ్రం చేయలేదు. దీనికి సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో ఇందులో పాములు, పురుగులు వంటివి కూడా చనిపోయాయని స్థానికులు వాపోతున్నారు. పైగా దీనిని శుభ్రం చేసేటప్పుడు తారులాంటి వ్యర్థ నీటిని జీవీఎంసీ సిబ్బంది బయటికి తోడారని స్థానికులు చెబుతున్నారు.

మూతల్లేని సింటెక్స్‌లు..



గాయత్రినగర్‌లో మూత లేని సింటెక్స్

కాలనీలో 19 బ్లాకుల్లో ఒక్కో బ్లాకుకు 32 ఇళ్ల చొప్పున 608 నివాసాలు ఉండగా, ఒక్కో బ్లాక్ మీద 4మాత్రమే సింటెక్స్ ట్యాంకులు ఉన్నాయి. ఇందులో మూడొంతుల డ్రమ్ములకు మూతలు లేవు. దుమ్ము ధూళి, చెత్తా చెదారం, పురుగు అన్నీ అందులోకే వెళ్తున్నాయి. పక్షులు రెట్ట వేయడం, అవి పడిపోయి చనిపోవడం వంటివి కూడా జరుగుతున్నాయి. ఇప్పుడు వాటిని నామమాత్రంగా శుభ్రం చేశారు, కానీ మూతలు మాత్రం ఏర్పాటు చేయలేదు. నీరు కలుషితం కావడానికి సంప్‌తో పాటు ఇవి కూడా ప్రధాన కారణమే అని అధికారులు నిర్ధారణకు వచ్చారు.

మూలకు చేరిన బోర్లు

కాలనీలో సుమారు 3వేల మంది ఉండగా ఒక్క వ్యక్తిగత కుళాయి, వీధి కుళాయి లేదు. ఈ సింటెక్స్‌ల నిండి కిందికి వచ్చిన నీరు పట్టుకుని తాగాలి. కాలనీలో ఉన్న 8 బోర్లలో 7 వరకు మూలకు చేరాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అవకాశం ఉన్న వారు బిస్లరీ, ఆర్వో వాటర్ కొనుక్కుని తాగుతున్నారు, మిగిలిన వారు ఈ నీటినే తాగుతున్నారు.



గాయత్రినగర్‌కు నీటిని సరఫరా చేస్తున్న జీవీఎంసీ వాటర్ సంప్

కాలనీ	: జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, గాయత్రి నగర్
ఏరియా	: పీఎం పాలెం
బ్లాకులు	: 19
మొత్తం నివాసాలు	: 608
జనాభా	: సుమారు 3వేలు
కుళాయిలు	: లేవు
బోరు బావులు	: 8
పని చేస్తున్నది	: ఒక్కటి మాత్రమే
సింటెక్స్	: బ్లాక్‌కు 4 మాత్రమే

మా కాలనీలో మంచినీటి చుక్క లేదు



మా కాలనీలో తాగడానికి మంచి నీరు చుక్క లేదు. కాలనీలో బోరు పాడై 6 నెలలు అయింది. పట్టించుకునేవారు లేరు. అవకాశం ఉన్న వారు కొనుక్కుని తాగుతున్నారు. మరికొందరు పక్కనే ఉన్న పెద్దల ఇళ్లలో బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.

– ఎస్‌కే గులాబీ, చిరు వ్యాపారి

మా బాధ ఎవరికి చెప్పకోవాలి?



జీవీఎంసీ నీరు బాగులేదు. అది కూడా ఎప్పుడు వస్తుందో, ఎంత నీరు వస్తుందో తెలియదు. బ్లాకులకు దగ్గరలో ఉన్న బోరు పాడైపోయింది. కనీసం దీన్ని రిపేరు చేసినా కాస్త బాగుండేది. ఎంత మందికి చెప్పినా ఫలితం లేదు.

– ధన, స్థానిక మహిళ, గాయత్రినగర్

పరిస్థితి దారుణంగా ఉంది



మా కాలనీలో నీరు బాగులేదు. బోర్లు ఉన్నవి పనిచెయ్యవు. వీధి కుళాయిలు లేవు. ఎమ్మెల్యే గారు ఓపెన్ చేసిన వెంటనే బోరు నుంచి బురద వచ్చేసింది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. మాలాంటి పేదోళ్ల కాలనీల్లో ఎక్కడ చూసినా ఇబ్బందులే కనిపిస్తున్నాయి.

– జీ.శివ, స్థానికుడు

కొత్త కేసుల్లేవు



కొత్త కేసులు నమోదు కాలేదు. పరిస్థితి అంతా అదుపులో ఉంది. ఇప్పటి వరకు క్యాంప్ ద్వారా ట్రీట్‌మెంట్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. కొత్త కేసులు లేనందున క్యాంప్ ఎత్తివేస్తున్నాం.

–సాహిత్య, మెడికల్ క్యాంప్ వైద్యాధికారి

పరిశుభ్రత లోపం వల్లనే..

గాయత్రినగర్‌లో వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలనే డయేరియా వ్యాపించింది. పైగా బ్లాకుల్లో సింటెక్స్‌లకు మూతలు లేవు. నిర్వహణ బాధ్యత వారే చూసుకోవాలి. వాటి గురించి వారికి అవగాహన కల్పిస్తున్నాం. మేము నీటి శాంపిల్స్ తీసి రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ అధికారుల ద్వారా పరీక్ష చేయించాం. నీటి కాలుష్యం కారణం కాదని చెప్పారు.

– కె. కనక మహాలక్ష్మి, జోనల్ కమిషనర్, మధురవాడ

నీటి కాలుష్యం వల్ల వచ్చే అవకాశం

సాధారణంగా ఆహారం, నీరు కలుషితం అవడం వల్లనే డయేరియా వస్తుంది. ఆహారం కలుషితం కావడానికి ఎక్కడా అవకాశాలు కన్పించలేదు. నీరు పరీక్ష చేయించినప్పుడు బాగానే ఉందని రిపోర్టు వచ్చింది. కానీ నీటి కాలుష్యం వల్లనే డయేరియా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ దిశగానే రోగులకు వైద్య సేవలు అందించాం. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉంది.

– సుజాన్, వైద్యాధికారి, పీఎం పాలెం యూపీహెచ్‌సీ

ఆక్రమణలపై రెవెన్యూ ఉక్కు పాదం

- రూ.6 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి స్వాధీనం
- 8వ వార్డు కీలక టీడీపీ నాయకుడి కనుసన్నల్లోనే కబ్జాలు



ప్రభుత్వ స్థలంలో పాకలను తొలగిస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ నేత ఆక్రమణకు చెక్ పెట్టారు. వివరాలివి.. రామానాయుడు ఫిల్మ్ స్టూడియో దరి తిమ్మాపురంలో సర్వే నెంబరు 379లో సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలంపై 8వ వార్డు టీడీపీ కీలక నేత కన్నేశారు. సుమారు రూ.6కోట్లకు పైగా అంచనా విలువున్న స్థలం ఆక్రమణకు స్కెచ్ వేశాడు. ముందుగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి స్థానికులచేత ఓ కమ్మల పాక వేయించి, నివాసం ఏర్పాటు చేశాడు. ఈ స్థలాన్ని త్వరలో బేరం పెట్టేందుకు సిద్ధమయ్యాడు. అయితే, స్థానికుల ఫిర్యాదుతో కథ అడ్డం తిరిగింది. ఈ ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు పలువురు సమాచారం అందించారు. దీంతో ఆర్డీవో సంగీత్ మాథూర్ వెంటనే స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన పూరి గుడిసెలను తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆధ్వర్యంలో, భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆర్‌ఐ కిషోర్ పర్యవేక్షణలో మంగళవారం నేలమట్టం చేశారు. వీటికి సమీపంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయితే రెండు రోజుల క్రితం ఈ ఆక్రమణలను తొలగించేందుకు ఆర్‌ఐ కిషోర్ తమ సిబ్బందితో వెళ్లగా, ఆక్రమణదారులు అధికారులపై దౌర్జన్యం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ కె.భాస్కర్ పర్యవేక్షణలో 20 మంది పోలీసులతో ప్రవేశించి ఈ 1500 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించి, స్వాధీనం చేసుకున్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి



గోవిందరాజు (ఫైల్)

పీఎం పాలెం: మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఉదంతంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పీఎం పాలెం ఆఖరు బస్టాప్ దరి బీ–2 కాలనీలోని బ్లాక్ నంబరు–15లో మకాన గోవిందరాజు (27) భార్య స్వాతితో కలిసి నివసిస్తున్నాడు. వీరికి ఇటీవలే వివాహం కాగా, బీ–2 కాలనీలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. దినసరికూలి కూలి అయిన గోవిందరాజు మద్యానికి బానిసయ్యాడు. ప్రతి రోజూ సాయంత్రం మద్యం సేవించి వచ్చి, ఏ కారణం లేకుండానే భార్యను కొట్టి, తిట్టి వేధించేవాడు. సోమవారం రాత్రి 9 గంటలకు వచ్చి మద్యం మత్తులో స్వాతిని వేధించడంతో, ఆమె భరించలేక సమీపంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు భార్య ఇంటికి వచ్చి చూడగా తలుపు లోపల గడియ వేసి ఉంది. పిలిచినా సమాధానం లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా, గోవిందరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, వారు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చంద్రబాబు చెప్పేవన్నీ మాయమాటలే..





ఆనందపురం మండల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను, పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

- ప్రతీ ఎన్నికల్లో ఇదే తీరు
- కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను

తగరపువలస: ప్రజల అమాయకత్వాన్ని పసిగట్టిన చంద్రబాబు ప్రతి ఎన్నికలలో మాయమాటలు చెప్పి గెలుస్తున్నాడని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల నాయకులు, కార్యకర్తలతో పందలపాక సర్పంచ్ దవళ నాగేశ్వరరావుకు చెందిన బాకూరుపాలెం కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' గురించి ఆయన మాట్లాడారు. 2014 ఎన్నికలలో డ్వాక్రా మహిళలు, రైతులకు రుణ మాఫీ, బాబు వస్తే జాబు తదితర పథకాలు అమలు చేస్తామని అధికారం చేపట్టిన చంద్రబాబు 2024 ఎన్నికలలో పవన్‌తో కలిసి సూపర్ సిక్స్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు తదితర పథకాలను ప్రకటించి, ఎగ్గొట్టారన్నారు.

బాండ్లు ఇచ్చి మరీ దగా..

ఎన్నికల హామీలలో వైఎస్ జగన్ 2019–2024 కాలంలో అమలు చేసిన పథకాలను కూడా కొనసాగిస్తామని రాష్ట్ర ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ దగా చేశారని చిన్న శ్రీను అన్నారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో వారి తరఫున నిలదీయవలసిన అవసరం ఉందన్నారు. అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా మన అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో గడప గడపకు కార్యక్రమాలు చేపట్టినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'పై కూడా ప్రజలను కలిసి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. మనం ఇచ్చే కరపత్రాలలో క్యూఆర్ కోడ్‌ను ప్రజల ఫోన్‌ల ద్వారా స్కాన్ చేస్తే చంద్రబాబు నెరవేర్చని హామీలు, వైఎస్సార్‌సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు తేలికగా అర్థం అవుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీకి తరగని ఆదరణ

2019 ఎన్నికలలో టీడీపీ ఓటమి చెందిన తరువాత ఆ పార్టీ నాయకులు నాలుగేళ్లు ముఖం చూపించలేక బయటకు రాలేదన్నారు. 2024 ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఓటమి తరువాత సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ప్రజలు తమ తప్పును తెలుసుకుని భీమిలిలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు.

మంత్రే ఇలా ప్రకటిస్తే..

18 ఏళ్లు నిండిన ప్రతీ ఆడబిడ్డకు ఆడబిడ్డ నిధి పేరుతో నెలకు రూ.1500 ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాట మార్చి ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం చూస్తుంటే సంక్షేమ పథకాలు కొనసాగించే ఆలోచన వారికి లేనట్టుందన్నారు. మన ప్రభుత్వంలో 35 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు ఏటా రూ.18,750 ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఉచిత బస్ విషయంలోనూ మాట మార్చారని.. ఎన్నికల ముందు బస్సు ఎక్కి తిరుపతి, శ్రీశైలం విజయవాడ, కాణిపాకం వంటి యాత్రలు చేయవచ్చన్న చంద్రబాబు ఇప్పుడు జిల్లా దాటకూడదని షరతులు పెడుతున్నారన్నారు.

వైఎస్సార్‌కు నివాళి

వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి చిన్నశ్రీను పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీలు మజ్జి శారదా ప్రియాంక, దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జిల్లా ప్రధానకార్యదర్శి గంద్రెడ్డి శ్రీనివాస్, మజ్జి వెంకటరావు, రెల్లి వెంకటరావు, విజినిగిరి అప్పలనాయుడు, బొట్ట రామకృష్ణ, పాండ్రంగి శ్రీను, బోని అప్పలనాయుడు, పాండ్రంగి అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు షిణగం దామోదరరావు, చందక లక్ష్మి, సూరిబాబు, షిణగం రాంబాబు, పిన్నింటి వెంకటరమణ, లెంక రాంబాబు, డోల ఆనంద్, కాళ్ల గౌరి, పల్లా రమణ, గీతల దేవుడు, కర్రి నాయుడు బాబు, తెడ్లాపు గోవింద్, కె.నగేష్, నాగోతు మహేష్, గుసిడి ముత్యాలు, బంటుపల్లి సూరినాయుడు, బంక కృష్ణమనాయుడు, కలిమి గంగరాజు, షిణగం ఎర్రయ్య, షిణగం అప్పలరాజు, బంక శ్రీను, కోన శ్రీను, బలిరెడ్డి మహేష్, ఉప్పాడ సూర్రెడ్డి, కోరాడ వెంకట రమణారావు, దశరథ రామారావు, పడాల రాము, ముసలినాయుడు, బోని సన్యాసప్పడు, కోరాడ గిరిరాజు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



ఎల్లారమ్మకు గాంధీబొమ్మ వీధి మహిళలు సమర్పించిన సారె



కొత్తపేట నుంచి కొత్తమ్మవారికి సారె తీసుకువెళ్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో గుడివాడ తోగాలమ్మ

తగరపువలస: ఆషాడమాసం చివరి మంగళవారం సందర్భంగా సంతపేట కొత్తమ్మతల్లికి మంగళవారం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఆషాడసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రంగూరి రాంబాబు, అక్కరమాని రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారమ్మ మెట్టపై ఎల్లారమ్మకు గాంధీబొమ్మ నుంచి తమ్మిన రాము ఆధ్వర్యంలో బాలాజీనగర్ నుంచి, జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో టి.నగరపాలెం నుంచి అమ్మవారికి ఆషాడసారె సమర్పించారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామ పంచాయతీ ప్రజలు రాస పోలమాంబకు, దిబీస్ రోడ్డులోని మద్దిపేట తోగాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు స్థానిక ప్రజలు సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి బాణసంచా, పులివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవారిని పంచామృతాలతో అభిషేకించిన అనంతరం 23 రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు జంగాల నరిసింహమూర్తి, ముప్పందం శ్రీనివాసరావు, నాళం సత్య కృష్ణ, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.